సాక్షి
అనంతపురం



సింహ వాహనంపై ఖాద్రీశుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బుధవారం సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

8లో



గురువారం ¦ 13 ¦ మార్చి ¦ 2025



'యువత పోరు' ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు, యువత, వైఎస్సార్ సీపీ శ్రేణులు

దగా పాలనపై దండయాత్ర

- 'అనంతలో' యువ గర్జన
- వైఎస్సార్ సీపీ 'యువత పోరు'కు విశేష స్పందన

దగా పడ్డ యువత గర్జించారు. ఫీజు బకాయిలు చెల్లించకుండా అవస్థలు పెడుతున్న చంద్రబాబు సర్కారు తీరుపై విద్యార్థులు దండెత్తారు. అధికారం కోసం అబద్ధపు హామీలిచ్చిన మోసగాళ్ల గుండెలు అదిరేలా నినదించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అనంతపురం నగరంలో నిర్వహించిన 'యువత పోరు'కు విశేష స్పందన లభించింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి విద్యార్థులు, యువత, కుల, విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మండే ఎండను సైతం లెక్క చేయకుండా ఆద్యంతం ఉత్సాహంగా కదిలి 'యువత పోరు'ను విజయవంతం చేశారు.



కూటమి సర్కారు తీరును నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

- అడ్డుకునేందుకు కూటమి సర్కారు కుటిల యత్నం
- అడుగడుగునా పోలీసుల నిఘా
- ఖాకీల ఆంక్షలను దాటుకుని కదం తొక్కిన విద్యార్థినులు

అనంతపురం కార్పొరేషన్: అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం వద్ద ఉదయం 11.05 గంటలకు 'యువత పోరు' ర్యాలీ మొదలైంది. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్, పార్టీ నియోజకవర్గాల సమన్వయకర్తలు విశ్వేశ్వర రెడ్డి, తలారి రంగయ్య, వై. వెంకటరామిరెడ్డి, మెట్టు గోవింద రెడ్డి, పెద్దారెడ్డి, వీరాంజనేయులు, ప్రభుత్వ విద్య మాజీ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డితో కలసి పార్టీ జిల్లా అధ్యక్షుడు 'అనంత' పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభించారు. సప్తగిరి సర్కిల్, సూర్యనగర్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకూ సాగిన ర్యాలీలో యువత, పార్టీ శ్రేణులు, విద్యార్థి సంఘాల నాయకులు కదం తొక్కారు. విద్యార్థినులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. 'సీఎం చంద్రబాబు డౌన్ డౌన్', 'చంద్రబాబు 420' అంటూ నినాదాలు చేశారు. 'జై జగన్.. జగనన్నే మళ్లీ సీఎం' అంటూ యువత దారి పొడవునా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు 'అనంత' ఆధ్వర్యంలో పార్టీ నేతలు వినతి పత్రం సమర్పించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, యువతకు వెంటనే రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో, కలెక్టరేట్ ఎదుట జరిగిన బహిరంగ సమావేశంలో నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి,యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర శేఖర్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, పార్టీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణవేణి, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, నాయకులు వెన్నం శివరామిరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, పార్టీ నేతలు శైలజానాథ్, విశ్వ, రంగయ్య, పెద్దారెడ్డి, వీరా, సాంబ, మెట్టు గోవిందరెడ్డి, నైరుతి రెడ్డి, రమేష్ గౌడ్, తదితరులు

ప్రభుత్వ మెడలు వంచుతాం



ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా ప్రజల పక్షంగా వైఎస్సార్ సీపీ పోరాడుతుంది. రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని, కరెంటు బిల్లులు తగ్గించాలని ఇప్పటికే వినతి పత్రాలు అందించాం. ప్రభుత్వంలో మార్పు రాకపోతే మా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రత్యక్ష పోరుకు దిగుతాం. కూటమి ప్రభుత్వ మెడలు వంచైనా పథకాలు అమలు చేయిస్తాం. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు రూ.4,600 కోట్లు ఉంటే గత ఏడాది ఈ సర్కారు ఇచ్చింది కేవలం రూ.700 కోట్లు. ఏటా ఈ రెండు పథకాలకు రూ.3,900 కోట్లు ఖర్చు అవుతుంది. కానీ ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించింది రూ.2,600 కోట్లే. 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తామని, నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు వాటిని విస్మరించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే పలు కళాశాలలు అవసరం లేదని, ఉన్న కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని కుట్ర చేస్తోంది.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు



మండే ఎండను సైతం లెక్కచేయకుండా ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థినులు

సంపద ఎక్కడ సృష్టించారు?



సంపద సృష్టించి ప్రజలకు అందిస్తామని ఎన్నికలు ముందు చంద్రబాబు గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఆ పని చేయకపోగా.. 9 నెలల కాలంలోనే రూ.1,15,000 కోట్ల అప్పులు చేశారు. గత ప్రభుత్వంలో రూ.14 లక్షల కోట్ల అప్పు చేశారని తప్పుడు మాటలు మాట్లాడారు. అమరావతి పేరుతో మిగిలిన ప్రాంతాల అభివృద్ధిని విస్మరిస్తున్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని చెప్పి ఇంత వరకు జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు.

– శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

రెడ్‌బుక్‌లో హామీలు రాసుకో బాబూ



రెడ్‌బుక్‌లో కక్ష సాధింపులు, దౌర్జన్యాలు రాసుకోవడం కాదు బాబూ..ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను రాస్తే వారికి కాసింత అయినా మేలు చేసినట్లవుతుంది. వైఎస్సార్ సీపీకి 40 శాతం ఓట్లు వచ్చాయి. ఆ విషయం మరవొద్దు. గత ప్రభుత్వంలో చేసిన అప్పులకు లెక్క ఉంది. కానీ, ఈ 9 నెలల్లో కూటమి ప్రభుత్వం చేసిన రూ.లక్ష కోట్లకు లెక్క లేదు. తాను ఎప్పుడు సీఎం అయినా విద్యార్థులను భయపెట్టడం చంద్రబాబుకు పరిపాటిగా మారింది.

– సాకే శైలజానాథ్, మాజీ మంత్రి

పేదలకు విద్య దూరం



హామీలను చంద్రబాబు తుంగలోకి తొక్కారు. విద్యను పేదలకు దూరం చేస్తున్నారు. వైద్య కళాశాలలు అవసరం లేదంటూ కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ రాశారు. దీంతో పేదలు వైద్య విద్యనభ్యసించే పరిస్థితి లేకుండా పోయింది.

– తలారి రంగయ్య, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త

ప్రజలను నట్టేట ముంచారు



కుల, మతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ రూ.2,75,000 కోట్లు సంక్షేమానికి కేటాయించారు. కానీ, నేడు చంద్రబాబు వైఎస్సార్ సీపీ వారికి పనులు చేస్తే పాముకు పాలు పోసినట్లేనని చెప్పడం దారుణం. ఎన్నికల ముందు 'సూపర్‌సిక్స్' హామీలను అమలు చేస్తామని చెప్పి.. అధికారం దక్కించుకున్నాక ప్రజలను నట్టేట ముంచారు.

– వై.విశ్వేశ్వర రెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త

దుర్మార్గపు పాలన



ఎన్నికలకు ముందు బాబు ష్యూరిటీకి మాది గ్యారెంటీ అంటూ బీజేపీ, జనసేన పార్టీలు నినదించాయి. నేడు ఏ ఒక్క హామీకి గ్యారెంటీ లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణం విడుదల చేయాలి. లేని పక్షంలో దుర్మార్గపు ప్రభుత్వానికి ప్రజలు తప్పక బుద్ధి చెబుతారు.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

తప్పక బుద్ధి చెబుతాం



అధికారం కోసం హామీలు ఇవ్వడం ఆ తర్వాత పట్టించుకోకపోవడం చంద్రబాబుకు పరిపాటిగా మారింది. 'కూటమి' కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టడంలో వైఎస్సార్ సీపీ ముందుంటుంది. ప్రజా సంక్షేమమే పరమావధిగా ముందుకెళ్తాం. చంద్రబాబు దిగుజారుడు రాజకీయాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన బుద్ధి చెబుతాం.

– మెట్టు గోవింద రెడ్డి, రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త

అరెస్టులు తప్ప ఏముంది?



సీఎం చంద్రబాబు మోసానికి చిరునామా. కుటిల రాజకీయాలు, ప్రత్యర్థులను అరెస్టులు చేయించడం తప్ప పరిపాలనతో ఆయనకు పని లేదు. విద్యార్థి, యువత సమస్యలను గాలికొదిలేశారు. డబ్బు కొల్లగొట్టడమే ధ్యేయంగా సాగుతున్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధించే వరకు పోరాటం సాగిస్తాం.

– ఆలూరు సాంబ శివారెడ్డి, ప్రభుత్వ విద్యా మాజీ సలహాదారు

9 నెలలకే ప్రజలను రోడ్డుకీడ్చారు



కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 9 నెలలకే ప్రజలు రోడ్డెక్కారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదు. వైఎస్సార్ సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు, దౌర్జన్యాలు చేస్తున్నారు. విద్యార్థులు, యువతపై కక్ష కట్టారు. బడా బాబుల పిల్లలు మాత్రమే ఉన్నత విద్య అభ్యసించాలని, పేద ప్రజలకు అవసరం లేదన్న ధోరణిలో కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది.

– రమేష్‌గౌడ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి

హామీల ఊసే ఎత్తడం లేదు



సీఎం చంద్రబాబు దగాకోరు. ఎన్నికలకు ముందు హామీలు గుప్పించి, ఇవాళ వాటి ఊసే ఎత్తడం లేదు. బడ్జెట్‌లోనూ అరకొర కేటాయింపులు చేశారు. రూ.వేల కోట్లు అవసరముంటే చాలీచాలని నిధులు కేటాయించడం చూస్తే..విద్యార్థులు, యువత, ప్రజల పట్ల ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతోంది. చంద్రబాబు ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయ్.

– వీరాంజనేయులు, శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త

విద్యా వ్యవస్థ నిర్వీర్యం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్య, వైద్య రంగంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ప్రభుత్వ వైఖరి పట్ల యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెస్తాం. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడతాం.

– చంద్రశేఖర్ యాదవ్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

పోరాటాలకు మద్దతుగా నిలుస్తాం



కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. నిధులు విడుదల చేయకుండా విద్యార్థులు రోడ్డెక్కేలా చేస్తోంది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ విద్యార్థుల భవిష్యత్తు కోసం 'యువత పోరుకు' శ్రీకారం చుట్టడాన్ని స్వాగతిస్తున్నాం. ఆయనకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. విద్యార్థుల సమస్యలపై వైఎస్సార్ సీపీ చేపట్టే కార్యక్రమాల్లో మేము కలసికట్టుగా అడుగులు వేస్తాం.

– పృథ్వీ, ఏఐఎస్‌బీ







ర్యాలీలో ముందుకు సాగుతున్న అనంత, సాంబ, శైలజానాథ్, విశ్వ, రంగయ్య, మహాలక్ష్మి శ్రీనివాస్, ప్లకార్డు చూపుతున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

పోలీసుల ఆంక్షలు దాటుకుని..

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ 'యువత పోరు' విజయవంతం కాకుండా కూటమి సర్కారు కుట్రలు పన్నింది. పోలీసులను రంగంలోకి దింపి అడుగడుగునా ఆంక్షలు విధించింది. అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ కళాశాల విద్యార్థులు 'యువత పోరు'కు వచ్చేందుకు సిద్ధం కాగా, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కళాశాల వద్ద భారీగా పోలీసులు మోహరించారు. విద్యార్థులకు పరీక్షలున్నాయని, బయటకు వెళ్లడానికి వీల్లేదంటూ పోలీసులు ఓవరాక్షన్ చేశారు. ఈ క్రమంలోనే అక్కడకు చేరుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్, పలువురు ప్రజా సంఘాల నాయకులు పోలీసుల తీరుపై మండిపడ్డారు. పరీక్షలు లేకున్నా ఏ విధంగా వారిని అడ్డుకుంటారని నిలదీశారు. ర్యాలీ సజావుగా జరిగేలా చూడాల్సిన పోలీసులే యువతను రెచ్చగొట్టేలా వ్యవహరించడం దారుణమని రమేష్ గౌడ్ విమర్శించారు. దీంతో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోగా.. విద్యార్థులు పోలీసుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. తమ భవిష్యత్తు కోసం పోరాటం చేస్తుంటే అడ్డుకోవడమేంటని విద్యార్థినులు ప్రశ్నించడంతో పోలీసులు వెనక్కు తగ్గారు.



పోలీసులతో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, ప్రజా సంఘాల నాయకుల వాగ్వాదం

ప్రజాహితమే పార్టీ ధ్యేయం

● వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి ● ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

అనంతపురం కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ స్ఫూర్తితో 2011 మార్చి 12న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆవిర్భవించిన వైఎస్సార్‌సీపీ నాటి నుంచి ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రజ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించిందన్నారు. 2019 నుంచి 2024 అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమమే ఊపిరిగా మనుగడ సాగించిందన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ... దేశ ప్రధాన మంత్రులు సైతం ఇచ్చిన మాటను అమలు చేయని సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయని, అలాంటిది సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఊహకందని విధంగా ప్రజలకు సంక్షేమాన్ని అందించారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతిపక్ష పాత్ర పోషించాలని ప్రజలు ఆదేశిస్తే దానిని కూడా చిత్తశుద్ధితో గత 9 నెలలుగా అధినేత వైఎస్ జగన్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో కూటమి ప్రభుత్వంపై పోరాటాలు సాగిస్తున్నామన్నారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా.. రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వైఎస్ జగన్, పార్టీ శ్రేణులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నా.. ఎంతో ఆత్మవిశ్వాసంతో ప్రతి కార్యకర్త పార్టీని అంటి పెట్టుకుని ఉండడం అభినందించదగ్గ విషయమన్నారు.


కేక్ కట్ చేస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి, సాకే శైలజానాథ్, తదితరులు


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం రోజున యువతపోరు కార్యక్రమాన్ని నిర్వహించడం అధినేత వైఎస్ జగన్ రెడ్డి పోరాట స్ఫూర్తికి నిదర్శనమన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందన్నారు. ప్రజలకు పథకాలు ఇవ్వకుండా, ప్రశ్నించిన వారిని భయపెట్టేలా వ్యవహరిస్తోందన్నారు. అన్ని వర్గాలభ్యున్నతి ఒక్క వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని, మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవడంలో భాగంగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ... గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.లక్షల కోట్ల డబ్బును ప్రజల ఖాతాల్లోకి నేరుగా చేరేలా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, తదితర వెనుకపడిన కులాలు అన్ని విధాల అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే వైఎస్సార్‌సీపీ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, ప్రభుత్వ విద్య మాజీ సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, రమేష్‌గౌడ్, సాకే చంద్రశేఖర్, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, చామలూరు రాజగోపాల్, చంద్రశేఖర్ యాదవ్, వెన్నం శివరామిరెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, కాగజ్‌ఘర్ రిజ్వాన్, అనిల్‌కుమార్ గౌడ్, సతీష్, రాధాకృష్ణ, చింతకుంట మధు, కేశవ రెడ్డి, అశ్వత్థనాయక్, సైఫుల్లాబేగ్, మల్లిమీద నరసింహులు, లబ్బే రాఘవ, అమర్‌నాథ్‌రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, శ్రీనివాస్‌దత్తా, కైలాష్, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, శివశంకర్ నాయక్, కృష్ణవేణి, శ్రీదేవి, దేవి, భారతి, శోభాబాయి, శోభారాణి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సాకే చంద్రలేఖ, రాజేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి ఇక్కట్లు తీర్చండి


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

కూడేరు: తాగునీటి ఇక్కట్లు తీర్చాలంటూ కూడేరు మండలం ముద్దలాపురానికి చెందిన కామ్రేడ్ లక్ష్మీదేవమ్మ కాలనీకి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు మాట్లాడుతూ... లక్ష్మీదేవమ్మ, జగనన్న కాలనీకి రెండింటికీ కలిపి మంచి నీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన బోరుబావిలో నీటి మట్టం తగ్గి తాగునీటి సమస్య జఠిలంగా మారిందన్నారు. గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కాలనీ పక్కనే వెళ్లిన సీపీడబ్ల్యూఎస్ స్కీం పైపులైన్ ద్వారా పైపులైన్ ఏర్పాటు చేసిన తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ కార్యాలయ సూపరింటెండెంట్ కేశవకు వినతి పత్రాన్ని అందజేశారు.

నేరాలు అరికట్టేలా సమష్టి కృషి


సైబర్ సురక్ష పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

అనంతపురం: నేరాలు అరికట్టేందుకు సమష్టిగా కృషి చేద్దామని ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, డ్రగ్స్ అనర్థాలు, మహిళల పట్ల వేధింపులు అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాలోని పలు స్వచ్ఛంద సేవా సంస్థల (ఎన్జీఓ) ప్రతినిధులతో బుధవారం ఎస్పీ ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. బాల్య వివాహాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా దుష్ప్రభావాలు, పోక్సో మహిళా సంరక్షణ చట్టాలు తదితర అంశాలపై ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. డ్రగ్స్ అనర్థాలపై యువతను చైతన్య పరిచేలా ఎన్జీఓలు కృషి చేయాలన్నారు. అనంతరం సైబర్ సురక్షలో భాగంగా ప్రజల్లో అవగాహన తేవడానికి రూపకల్పన చేసిన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సైబర్ సీఐ జాకీర్, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చింత పండు ధర తగ్గుముఖం

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం 1573.50 క్వింటాళ్ల చింత పండు విక్రయానికి రాగా... మీడియం ఫ్లవర్ రకం క్వింటా గరిష్టం రూ. 13వేలు, కనిష్టం రూ.4,300 చొప్పున సగటున రూ.6వేలతో అమ్ముడుపోయింది. అలాగే కరిపులి (ఫైన్) క్వింటా గరిష్టం రూ.33వేలు, కనిష్టం రూ.8వేలు, సగటు రూ.15వేలు చొప్పున ధర పలికింది. గత సోమవారం క్వింటా కరిపులి గరిష్ట ధర రూ.40వేలు కాగా, బుధవారం రూ.33వేలకు చేరుకోవడం గమనార్హం.

● సింహ వాహనంపై దర్శనమిచ్చిన ఖాద్రీశుడు

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి నాల్గవ రోజైన బుధవారం సింహ వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సింహం శౌర్యానికి, గాంభీర్యానికి, పరాక్రమానికి ప్రతీక. స్వామివారికి ప్రీతి పాత్రమైన ఈ సింహ రూపంలోనే నర-సింహ అవతారమెత్తి హిరణ్య కశిపుడిని సంహరించారు. స్వామివారు తిరువీధుల్లో ఊరేగుతుంటే ఎప్పటిలాగానే తమిళనాడుకు చెందిన నాదస్వరం, డోలు విద్వాంసులు శ్రీవారి వాహనం ముందు భక్తితో పాటు తమ కళను చాటుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీ నారసింహుడు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.


సింహవాహనంపై లక్ష్మీనారసింహుడు


శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తజనం

423 మంది విద్యార్థుల గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఫిజిక్స్ పేపర్-2, ఎకనామిక్స్ పేపర్-2 పరీక్షలకు జిల్లాలో 423 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 20,413 మందికి గాను 20,031 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,771 మందికి గాను 1,730 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఇంటర్ బోర్డ్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎం. వెంకటరమణనాయక్ 5 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే కమిటీ సభ్యులు 4, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 15, కస్టోడియన్లు 11 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ఉద్యాన రైతులకు మరింత లబ్ధి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం బాగా పెరిగినందున మెరుగైన ఫలసాయం, మార్కెటింగ్ సదుపాయం ద్వారా రైతులకు మరింత లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ అనుబంధ రంగాలపై సంబంధిత శాఖల అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. ప్రధానంగా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖలు, మార్క్‌ఫెడ్ ద్వారా పంట ఉత్పత్తుల కొనుగోళ్ల అంశాలపై ఆరా తీశారు. అరటి, మామిడి, చీనీ, టమాట, మిరప పంటలను ఐదు గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించి వాటి ద్వారా రైతులు ఆర్థికంగా లాభపడేలా చర్యలు చేపట్టాలన్నారు. దేశంలోని ఉత్తరాది ప్రాంతాలతో పాటు విదేశాలకూ ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతులు పెంచాలన్నారు. నెలాఖరులోపు లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం మామిడి కీలక దశలో ఉన్నందున నాణ్యమైన దిగుబడులు సాధించాలంటే 50 శాతం రాయితీతో ఇస్తున్న ఫ్రూట్ కవర్లు రైతులు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యానశాఖ స్ఫూర్తితో పట్టుపరిశ్రమశాఖ అధికారులు కూడా జిల్లాలో మల్బరీ విస్తీర్ణం పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది 800 ఎకరాల లక్ష్యానికి గానూ 300 ఎకరాలు మాత్రమే సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెటింగ్ పరిస్థితి బాగున్నందున ఏడాదిలో 10 పంటలు పండించే పరిస్థితి ఉన్నందున రైతులు ఆర్థిక పురోగతి సాధించడానికి మల్బరీని ప్రోత్సహించాలన్నారు. రైతులు పండించిన కందులు, పప్పుశనగను మార్క్‌ఫెడ్ ద్వారా చేపట్టిన కొనుగోళ్లపై ఆరాతీశారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) దక్కేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, పశుశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు, పట్టుశాఖ అధికారి డి.ఆంజనేయులు, మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి, మత్స్యశాఖ డీడీ శ్రీనివాసనాయక్, ఆత్మ పీడీ మద్దిలేటితో పాటు ఏపీడీలు, ఏడీఏలు, ఏఓలు, హెచ్ఓలు తదితరులు పాల్గొన్నారు.


రాయితీతో అందించే మ్యాంగో ఫ్రూట్ కవర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అదనపు బస్సు సర్వీసుల ఏర్పాటు


గ్యారేజీలో బస్సుల మరమ్మతును పరిశీలిస్తున్న ఆర్ఎం సుమంత్

ఉరవకొండ: జిల్లాలోని వివిధ డిపోల పరిధిలో నిత్యం రద్దీగా ఉండే రూట్లకు అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం సుమంత్.ఆర్.ఆదోని తెలిపారు. బుధవారం ఉరవకొండ ఆర్టీసీ డిపోను ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. జిల్లాకు 48 కొత్త బస్సుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పాత బస్సుల స్థానంలో 98 కొత్త బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీలో ప్రస్తుతం నష్టాలు తగ్గాయని, త్వరలోనే లాభాల బాటలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. రెండేళ్లలో కారుణ్య నియామకాల కింద రెండు దఫాలుగా 131 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. త్వరలో మరో 38 మందిని కండక్టర్లుగా అవకాశం కల్పిస్తామన్నారు. ఉరవకొండ డిపో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉరవకొండ డీఎం హంపన్న, ఎస్టీఐ రమణమ్మ పాల్గొన్నారు.

‘ఉపాధి’ బకాయిలు వెంటనే చెల్లించాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

కళ్యాణదుర్గం రూరల్: ఉపాధి కూలీలకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ కలసి కళ్యాణదుర్గం మండలం యర్రంపల్లి, గరుడాపురం, శెట్టూరు మండలం యాటకల్లు గ్రామాల్లో బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు 6 నుంచి 8 వారాల పాటు బిల్లులు మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పదేళ్ల క్రితం మంజూరు చేసిన పనిముట్లతోనే కాలం నెట్టుకొస్తున్నారన్నారు. తక్షణమే కొత్త పనిముట్లు అందజేయాలని, పని ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని, వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

‘పీఎంఏవై’లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అదనపు లబ్ధి

అనంతపురం అర్బన్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం కింద బీసీ, ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక లబ్ధిని ప్రభుత్వం చేకూరుస్తోందని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్ఓ ఎ.మలోల, హౌసింగ్ పీడీ శైలజతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పీఎంఏవై 1.0 కింద జిల్లాకు 82,159 ఇళ్లు మంజూరు కాగా, ఇందులో 35,351 ఇళ్లు పూర్తయ్యాయని, 28,560 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణానికి యూనిట్ ధర రూ.1.80 లక్షలుగా నిర్దేశించినట్లు తెలిపారు. దీనికి అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.70 వేలు ఆర్థిక లబ్ధి ఉంటుందన్నారు. ఇందులో నిబంధనలు వర్తిస్తాయన్నారు. తద్వారా జిల్లాలో 15,882 మంది బీసీలు, 4,232 మంది ఎస్సీలు, 904 మంది ఎస్టీలకు అదనపు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీవరకు లబ్ధిదారుల ఇళ్లకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెళ్లి అదనపు లబ్ధి గురించి వివరించి, వారి ఇంటిని ఫొటో తీసుకుంటారన్నారు.

‘దుర్గం’లో దోపిడీ దొంగల బీభత్సం

- రెండిళ్లలో వరుస చోరీలు
- ముదిగల్లు బైపాస్‌లో నాలుగు గొర్రెల అపహరణ
- అర్ధరాత్రి కత్తులతో దుండగుల హల్‌చల్

కళ్యాణదుర్గం: పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. కత్తులు చేతపట్టుకుని హల్‌చల్ చేశారు. ఏకంగా రెండిళ్లలో చోరీలకు పాల్పడి, మరో ఇంట్లోకి చొరబడేందుకు విఫలయత్నం చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.... కళ్యాణదుర్గంలోని పార్వతీ నగర్‌లో నివాసముంటున్న దీప, అనిల్ దంపతులు మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి పైకెళ్లి నిద్రించారు. విషయాన్ని గుర్తించిన దుండగులు లోపలకు చొరబడి బీరువాను ధ్వంసం చేసి, నాలుగు తులాల బంగారు నగలు, రూ.1.60 లక్షల నగదు అపహరించారు. అనంతరం పక్కనే ఉన్న శిల్ప ఇంట్లో చొరబడి బ్రాస్‌లైట్‌ను అపహరించారు. ముదిగల్లు బైపాస్ వద్ద శ్రీకాంత్‌కు చెందిన నాలుగు గొర్రెలను ఎత్తుకెళ్లారు.

ముసుగులు ధరించి... కత్తులు చేతపట్టి

పార్వతీనగర్ శివారు ప్రాంతంలోని అక్కమాంబ కొండ సమీపంలో నివాసముంటున్న మీ-సేవ కేంద్రం నిర్వాహకుడు బాబు ఇంటి వద్ద మంగళవారం అర్ధరాత్రి 2.10 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు ముఖాలకు ముసుగులు ధరించి, కత్తులతో హల్‌చల్ చేశారు.ఒకరు ప్రహరీ దూకి లోపలికి చొరబడే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో కుక్కలు మొరగడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఈ దృశ్యాలు అక్కడి సీసీకెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి.


కత్తులతో తచ్చాడుతున్న దుండగులు

పరిశీలించిన డీఎస్పీ రవిబాబు

వరుస దోపిడీల సమాచారం అందుకున్న డీఎస్పీ రవిబాబు, అర్బన్ సీఐ యువరాజు, సిబ్బంది బుధవారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంను రంగంలో దింపి నిందితుల ఆధారాలు సేకరించారు. కాగా, దుండగులు కత్తులు పట్టుకుని సంచరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. వచ్చిన వారు దొంగలా లేక పార్థీ గ్యాంగ్ ముఠా సభ్యులనే అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమయ్యాయి.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి

డి.హీరేహాళ్(రాయదుర్గం): డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన తిప్పేస్వామి, రూతమ్మ దంపతుల మూడవ కుమార్తె అర్పిత (5) ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై బుధవారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు.. పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన అర్పిత బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. ఆ సమయంలో విద్యుత్ బల్బుకు అనుసంధానం చేసిన వైరు తెగి రేకు తలుపుపై పడింది. విషయాన్ని గమనించని బాలిక తలుపు తీసేందుకు ప్రయత్నించినప్పుడు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. బాత్రూమ్‌కు వెళ్లిన బిడ్డ ఎంతసేపటికి రాకపోవడంతో అటుగా వెళ్లి గమనించిన తల్లికి విగత జీవిగా పడి ఉన్న అర్పిత కనిపించడంతో గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని విద్యుత్ సరఫరాను ఆపి అర్పిత మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. కాగా, బతుకు తెరువు కోసం బెంగళూరుకు వలస వెళ్లిన తండ్రి తిప్పేస్వామికి విషయాన్ని చేరవేయడంతో ఆయన బయలుదేరినట్లు సమాచారం.


క్లస్టర్ రీసోర్స్ సెంటర్లకు నిధుల మంజూరు


అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో కొత్తగా ఏర్పడిన 135 క్లస్టర్ రీసోర్స్ సెంటర్ల నిర్వహణకు నిధులు మంజూరయ్యాయి. జిల్లాకు కేటాయించిన రూ. 1.35 కోట్ల క్లస్టర్ రీసోర్స్ గ్రాంట్‌ను ఆయా క్లస్టర్ పాఠశాలల హెచ్ఎంలకు నాలుగు పద్దుల కింద విడుదల చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ తెలిపారు. మీటింగ్ ఏటీ గ్రాంట్, మెయింటెనెన్స్ గ్రాంట్, కంటింజెన్సీ గ్రాంట్, టీఎల్ఎం గ్రాంట్ కింద ఒక్కో క్లస్టర్ రీసోర్స్ సెంటర్‌కు రూ. లక్ష చొప్పున విడుదల చేశామన్నారు. నిబంధనల మేరకు ఖర్చు చేసి వివరాలను మండల విద్యాశాఖ అధికారి ఆమోదంతో టీసీఎస్ వారు రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే జిల్లాలోని 26 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సమగ్రశిక్ష ద్వారా కాంపోజిట్ స్కూల్ గ్రాంట్ నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ దామాషాలో భాగంగా మొత్తం రూ. 16 లక్షలను ఆయా కళాశాలలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. నిధులను ఖర్చు చేసి ఎంఈఓల ఆమోదంతో టీసీఎస్ రూపొందించిన యాప్, ప్రబంధ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

టీడీపీ నేతల దాష్టీకం

● వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కర్రలతో దాడి

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన కురుబ చిక్కాల బాలన్నపై టీడీపీ నేతలు అతి కిరాతకంగా కర్రలతో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన బుధవారం రాత్రి ఆత్మకూరు మండలం సిద్ధరాంపురం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన మేరకు... బుధవారం సాయంత్రం తన పొలంలో పనులు చూసుకుని ఇంటికి వెళుతున్న బాలన్నపై కాపు కాచిన టీడీపీ నేతలు కర్రలతో విరుచుకుపడ్డారు. నియోజకవర్గంలో సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న కురుబలపై దాడి చేయడం ద్వారా వారిలో అభద్రతా భావాన్ని పెంచేందుకు పన్నిన కుట్రలో భాగంగానే ఈ కుట్రకు తెరలేపినట్లుగా పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. దాడి అనంతరం కురుబ చిక్కాల బాలన్న ఆత్మకూరుకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాడి చేసిన నారాయణస్వామి, రమేష్, భరత్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు.


శరీరమంతా కంది పోయిన దృశ్యం


బాధితుడు కురుబ బాలన్న

●ఇమామూ.. నీ సేవకు సలాం



ఇదో రైతు బిడ్డ వ్యథ. హలం పట్టి పొలం దున్నే సమయంలో ప్రజల ఆకలి దప్పికలు తీర్చే ఆలోచన తప్ప మరొకటి లేదు. వరుస పంట నష్టాలను తాళలేక కుటుంబాన్ని పోషించుకునేందుకు ఆటో డ్రైవర్‌గా మారినా ప్రజల దాహార్తిని తీర్చడం మరువలేదు. పది మంది మంచిగా ఉంటే చాలనే మంచి మనసు అన్నదాతకు తప్ప మరెవ్వరికూ లేదని అని నిరూపించారు ఓబుళదేవరచెరువు మండలం నున్నంపల్లికి చెందిన దూదేకుల ఇమాములు. కాలం కలసి రాక వ్యవసాయం మాని 30 ఏళ్ల క్రితం పొట్ట చేత పట్టుకుని అనంతపురానికి చేరుకున్న ఇమాములు ఆటో డ్రైవర్‌గా మారాడు. ఇద్దరు పిల్లలకు ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. ఏటా వేసవి వచ్చిందంటే చాలు.. తన ఆటోలో చల్లని మంచినీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నారు. ‘నేను రైతు బిడ్డను. చల్లని తాగునీరు ఉచితం’ అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకుని రైతు సంక్షేమాన్ని మరవొద్దంటూ నేటి తరానికి ఆయన అందిస్తున్న సందేశం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

– అనంతపురం సిటీ

ఆ టీచర్‌ను నమ్ముకుంటే భవిత ‘బూడిద’

- వివాదాస్పదంగా మారిన చియ్యేడు జెడ్పీహెచ్ఎస్ టీచర్ నాగేంద్ర తీరు
- పాఠ్యాంశాల బోధన కంటే రాజకీయాలే ఎక్కువ
- బినామీలతో ‘రియల్’ వ్యాపారం
- డీఈఓ, కలెక్టర్, కమిషనర్, విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రికి ఫిర్యాదులు
- ఉన్నతాధికారుల ఆదేశాలతో నామమాత్రపు విచారణ

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచరుగా పనిచేస్తున్న బూడిద నాగేంద్ర తీరు వివాదస్పదంగా మారింది. ఆ టీచర్‌ను నమ్ముకుంటే తమ భవిష్యత్తు బూడిదవుతుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన అవినీతి, అక్రమాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, విపరీతమైన రాజకీయ జోక్యం తదితర అంశాలపై డీఈఓ మొదలు కలెక్టర్, పాఠశాల విద్య కమిషనర్, విద్యాశాఖ మంత్రి, చివరకు ముఖ్యమంత్రి కార్యాలయానికి గ్రామస్తులు ఫిర్యాదులు చేయడం కలకలం రేపుతోంది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు ఇలా... పీహెచ్ కోటా కింద ఉద్యోగం పొందిన టీచరు నాగేంద్ర సర్టిఫికెట్ సైతం భోగేసనని గ్రామస్తులు ఆరోపించారు. ఆయన పొందిన సర్టిఫికెట్‌పై అనుమానాలు వ్యక్తం చేశారు. ఆకుతోటపల్లికి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని బినామీగా పెట్టుకుని జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడని, గ్రామంలో గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తూ వర్గ కక్షలకు కారణమవుతున్నాడని ఆరోపించారు. ఆయన తీరుతో ముఖ్యంగా ఎస్సీ కాలనీలో తీవ్ర శాంతిభద్రతల సమస్య నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే చియ్యేడు నుంచి యర్రాయపల్లికి వెళ్లే మార్గంలో 10 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన నాగేంద్ర... ఆ పక్కనే ఉన్న శివాసాగు భూమిని ఆక్రమించి తన మేనమామ పేరుపై పాస్ బుక్ చేయించినట్లు ఆరోపించారు. ఫిర్యాదులపై స్పందించిన రాష్ట్ర అధికారులు, విద్యాశాఖ మంత్రి కార్యాలయం నుంచి విచారణకు ఆదేశించారు. ఈ క్రమంలో ఇటీవల విచారణకు వెళ్లిన ఓ అధికారి గ్రామస్తులను కాకుండా తరగతి గదిలోని నాలుగు గోడల మధ్య విచారణ జరిపి సదరు టీచరు పనితీరు బాగుందంటూ నివేదిక పంపడం విశేషం. ఈ విషయం తెలిసి కొందరు గ్రామస్తులు నేరుగా కమిషనర్, ముఖ్యమంత్రిని కలిసి మరోమారు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరా వేళలు మార్చాలి



విద్యుత్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఆత్మకూరు: విద్యుత్ సరఫరా వేళలను మార్చాలని మండలంలోని పి.కొత్తపల్లి ఫీడర్‌కు చెందిన రైతులు కోరారు. బుధవారం విద్యుత్ శాఖ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరా ఒకేసారి 7 గంటలు వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అలా కాకుండా ఉదయం 3 గంటలు.. సాయంత్రం 4 గంటలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వాటర్ ప్యూరిఫైర్ వితరణ

అనంతపురం కల్చరల్: రామ్‌నగర్‌లోని రాస్ దివ్యాంగుల ప్రాంగణానికి ఎన్‌కేసీ స్వచ్ఛంద సంస్థ వారు బుధవారం వాటర్ ప్యూరిఫైర్ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ పరదేశీ నాయుడు, ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ వ్యవస్థాపకుడు కేపీ రాజు, ఎన్‌కేసీ ప్రధాన కార్యదర్శి కమలనాథ్, పండిట్ రియాజుద్దీన్, శ్రీకాంత్, బుల్లితెర నటుడు సాకే సుధాకర్, అవార్డు చిత్రాల కెమెరామెన్ లింగాల పవన్, శంకరరెడ్డి, సంధ్యారాణి పాల్గొన్నారు.

కొబ్బరి చిప్పల సేకరణకు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కొబ్బరి చిప్పల సేకరణ హక్కులకు బుధవారం వేలంపాట పాట నిర్వహించారు. సాయి కృష్ణ అనే వ్యక్తి రూ.4.23 లక్షలకు హక్కులను దక్కించుకున్నట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. గత ఏడాది కన్నా రూ.23 వేలు అధికంగా వేలం పాటలో ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఒత్తిడికి గురికావొద్దు'

ఆత్మకూరు: పదో తరగతి పరీక్షలు బాగా రాయాలని ఎంఈఓ-2 రామాంజనేయులు విద్యార్థులకు సూచించారు. బుధవారం మండలంలోని సనప ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని తెలిపారు. సమయానికి నిద్రపోయి, మంచి ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మంచి మార్కులు సాధించి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీలను అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

రాప్తాడు: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకుని రావాలి. పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలో జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, విస్తరణ అధికారులకు చెత్త సంపద కేంద్రాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పంచాయతీ గ్రామాల్లోని తడి, పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేయాలని తెలిపారు. ఆ ఎరువులను రైతులకు విక్రయించి ఆదాయం పెంచుకోవాలని సూచించారు. అనంతరం చెత్త ద్వారా ఎరువులు ఎలా తయారు చేయాలో క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, విస్తరణ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ముస్లింల మనోభావాలు దెబ్బతీయొద్దు'

అనంతపురం కల్చరల్: మైనార్టీలను అల్లరి మూకలని ఎగతాళిగా మాట్లాడిన ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి బేషరతుగా క్షమాపణ చెప్పాలని పలు ముస్లిం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు వేర్వేరు ప్రకటనల్లో పార్థసారథి తీరును ఖండించారు. ముస్లిం ఓట్లతో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కొన్నాళ్లకే వారి బుద్ధి ప్రకటించుకున్నారన్నారు. అసెంబ్లీ సాక్షిగా ముస్లింలను కించపరుస్తూ ఎమ్మెల్యే మాట్లాడిన తీరు హేయమన్నారు. రాయచోటిలో జరిగిన సంఘటన రెండు వర్గాలది సమానంగా తప్పు ఉంది కాబట్టే అందరూ ముస్లిం సమాజాన్ని తప్పుబట్టడం లేదని.. కానీ ప్రభుత్వ ప్రతినిధులు ఒక వర్గానికి కొమ్ముకాయడం బాధాకరమన్నారు. అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని త్వరలో ఉద్యమం చేస్తామని టిప్పు సుల్తాన్ అభిమాన సంఘం అధ్యక్షుడు జాకీర్ హెచ్చరించారు.



ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, తదితరులు



ర్యాలీగా వెళ్తున్న యువత, విద్యార్థులు, ప్రజా సంఘాలు



ప్లకార్డులతో కలెక్టరేట్ వద్దకు బయలుదేరిన విద్యార్థినులు

యువత పోరు సక్సెస్

- పార్టీ కేడర్‌లో ఉత్సాహం
- జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- ర్యాలీలో భారీగా పాల్గొన్న విద్యార్థులు



నినాదాలు చేస్తున్న విద్యార్థులు



కలెక్టరేట్ వద్దకు వచ్చిన విద్యార్థులు, యువతను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

అనంతపురం కార్పొరేషన్: యువతకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపుమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. బుధవారం వైఎస్సార్‌సీపీ ఏర్పాటై 14 ఏళ్లు పూర్తి చేసుకోవడం.. ఆవిర్భావ దినోత్సవం రోజున యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించడంతో జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్ వద్ద జరిగిన యువత పోరు కార్యక్రమం, ర్యాలీలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. జై జగన్.. జై జై జగన్ నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతం మార్మోగింది. విద్యార్థులు, నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో ర్యాలీలో పాల్గొనడంతో ప్రజలు మిద్దెలపై నుంచి వీక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, కృష్ణవేణి, చింతా సోమశేఖర్ రెడ్డి, రమేష్‌గౌడ్, సాకే చంద్రశేఖర్, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొత్తకోట చక్రధర్ రెడ్డి, నల్లప్పరెడ్డి, చామలూరు రాజగోపాల్, చంద్రశేఖర్ యాదవ్, వెన్నం శివరామిరెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, కాగజ్‌ఘర్ రిజ్వాన్, అనిల్‌కుమార్ గౌడ్, సతీష్, రాధాకృష్ణ, చింతకుంట మధు, కేశవ రెడ్డి, అశ్వర్థ నాయక్, సైపుల్లాబేగ్, మల్లెమీద నరసింహులు, మీసాల రంగన్న, లబ్బే రాఘవ, అమర్‌నాథ్ రెడ్డి, కొనా రాజారెడ్డి, కట్టుబడి తానీష, కొర్రపాడు హుస్సేన్ పీరా, జ్వాలాపురం శ్రీకాంత్, శ్రీనివాస్ దత్తా, బాబా సలాం, కై లాష్, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి, శివశంకర్ నాయక్, శ్రీదేవి, దేవి, భారతి, శోభాబాయి, శోభారాణి, విజయశాంతి, సుజాత రెడ్డి, కార్పొరేటర్లు కమల్ భూషణ్, సాకే చంద్రలేఖ, రాజేశ్వరి, అనిల్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారీగా వచ్చిన విద్యార్థులు

యువత పోరుకు వివిధ కళాశాలల నుంచి భారీగా విద్యార్థులు తరలి వచ్చారు. స్వచ్ఛందంగా ర్యాలీలో విద్యార్థులు పాల్గొనడం విశేషం. విద్యార్థుల పెద్ద ఎత్తున తరలిరావడంతో కూటమి ప్రభుత్వంపై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు.





ర్యాలీలో పాల్గొన్న పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, పార్టీ యువజన విభాగం అదనపు జోనల్ ఇన్‌చార్జ్ కొత్తకోట చక్రధర్ రెడ్డి

హైస్కూళ్లుగా ఉన్నతీకరించాలి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా (హైస్కూళ్లు) ఉన్నతీకరించాలని ఎస్టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. 117 జీఓ రద్దు నేపథ్యంలో విద్యాశాఖ కొత్త విధివిధానాలను ప్రవేశపెట్టిందన్నారు. 1 నుంచి 5 తరగతులకు మోడల్ స్కూళ్లుగా, విద్యార్థుల సంఖ్య 6, 7, 8 తరగతుల్లో 60కి పైగా ఉంటే వాటిని ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించాలని నిర్ణయించారన్నారు. నగర పరిధిలో నాలుగు యూపీ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. దశాబ్దాలుగా అవి ప్రాథమికోన్నత పాఠశాలలు గానే ఉన్నాయన్నారు. వీటిలో 6, 7, 8 తరగతులకు దాదాపు 100 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. కేవలం ఒక పాఠశాలను మాత్రమే ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించేందుకు నివేదిక తయారు చేశారన్నారు. నగర పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు ఎక్కువగా కార్పొరేషన్ స్కూళ్లలోనే చదువుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఉన్నతాధికారులు అన్ని యూపీ పాఠశాలలను హైస్కూళ్లుగా ఉన్నతీకరించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఎస్టీయూ రాష్ట్ర మున్సిపల్ విభాగం కన్వీనర్ ఫణి భూషణ్, నాయకులు జనార్దన్, విరుపాక్షి గౌడ్, యుగంధర్, రాజన్న, రామకృష్ణ, రమేష్, నరసింహులు, ఏపీటీఎఫ్ నాయకులు ఓబులేసు, ఆదినారాయణ, రామానుజులు, నారాయణ నాయక్, తిరుపాల్ నాయక్, రవీంద్ర, లోకయ్య పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి

అనంతపురం అర్బన్: కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణుడు అధ్యక్షతన జరిగిన ఆఫీస్ బేరర్లు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగించేందుకు ఈనెల 22, 23 తేదీల్లో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యశాలలకు రాష్ట్ర నాయకత్వం, మేధావి వర్గం హాజరవుతుందని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పును ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. కార్మికులపై కూటమి ప్రభుత్వం సాగిస్తున్న దౌర్జన్యాలు ఆపాలన్నారు. పవన్ కళ్యాణ్ తన సనాతన ధర్మాన్ని, నారాలోకేష్ రెడ్‌బుక్ పాలన ఆపి ప్రజల సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రానికి పరిశ్రమలు, ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలుపై ఎన్‌డీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఆఫీస్ బేరర్లు చిరంజీవి, రాజు, నాగవేణి, మెడికల్ యూనియన్ జిల్లా కార్యదర్శి మనోహర్, మునిసిపల్ కార్మిక సంఘం నాయకులు నాగేంద్ర బాబు, శివకృష్ణ, తిరుమలయ్య, ఎర్రప్ప, హమాలీల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్ బాషా, తదితర అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరిపించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన కళాశాల విద్య ఆర్జేడీ నాగలింగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరంలో నిర్వహించిన జాబ్‌మేళా పేరుతో నిధులు గోల్‌మాల్ చేశారన్నారు. విద్యార్థులు రాకపోయినా వారి పేర్లను ఎన్‌రోల్ చేసి దొంగ బిల్లులు పెట్టుకుని నిధులు డ్రా చేశారని ఆరోపించారు. కేటరింగ్ వారికి విచ్చలవిడిగా బిల్లులు చేశారని పేర్కొన్నారు. అలాగే సప్లయర్స్, ఫ్రూట్స్, భోజనం, లాడ్జీలు, ప్రింటింగ్ పేరుతో లక్షలాది రూపాయలు అప్పణంగా డ్రా చేశారన్నారు. వీటన్నింటిపై సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జేకేసీ విభాగంలో రెండేళ్లు స్వీపర్‌గా పని చేయించుకుని డబ్బులు చెల్లించలేదన్నారు. ఆ నిధులను డ్రా చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘాల నాయకులు వంశీ, మంజునాథ్, పవన్, గణేష్, ముఖేష్, యశ్వంత్, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీ

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులను బుధవారం డీఎంహెచ్ఓ ఈబీ దేవి తనిఖీ చేశారు. పట్టణంలోని స్కానింగ్ సెంటర్లు, ఫిజియోథెరపీ సెంటర్లలో సౌకర్యాలను పరిశీలించారు. రెన్యూవల్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో వాటిలో మౌలిక వసతులపై డీఎంహెచ్ఓ ఆరా తీశారు.

ప్రజా సమస్యలపై పోరాడతాం

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



రాప్తాడు: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

రాప్తాడు: ప్రజా సమస్యలపై పోరాడతామని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కన్వీనర్ సాకే వెంకటేష్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా 44వ జాతీయ రహదారిపై ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి ర్యాలీగా తరలివెళ్లారు. అక్కడ పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధనకు ఆవిర్భవించిన పార్టీలో ప్రతి కార్యకర్త అంకిత భావంతో సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఇచ్చిన హామీలను నెరవేర్చి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రూరల్ జెడ్పీటీసీ చంద్రకుమార్, రూరల్ మండల కన్వీనర్ బండి పవన్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్రా వెంకటేష్, చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, నీరుగంటి నారాయణ రెడ్డి, చెన్నారెడ్డి, గురుప్రసాద్, సింగారప్ప, రవికుమార్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సర్పంచ్ వరలక్ష్మి ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరప్ప, వెంకటేష్, శ్రీరాములు, గంగాధర్, మురళి, వెంకట్రామిరెడ్డి, నరేంద్ర, నరేష్ రెడ్డి, దామోదర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా వైఎస్సార్‌సీపీ



పుట్టపర్తిలో జరిగిన యువత పోరులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



ఆత్మకూరు నుంచి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: విద్యార్థులు, నిరుద్యోగులకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలోవైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'యువత పోరు' కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, యువకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడుస్తుందని విమర్శించారు. వెంటనే రూ.4,600 కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీజుల కోసం కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఎన్నికల్లో రూ.3 వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని.. బడ్జెట్‌లో ఎక్కాడా దీని ప్రస్తావన లేదన్నారు. వైఎస్ జగన్ పాలనలో 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుడితే.. కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేయడానికి సిద్ధమవుతోందని ఆరోపించారు.

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరుకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, నాయకులు అంజినప్ప, ఈశ్వరరెడ్డి, రామాంజి, నాగరాజు, వెంకటేష్, మహేష్, మలరాయుడు, పెద్దన్న, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితం కళలతోనే సాధ్యం

అనంతపురం కల్చరల్: సమాజ హితం కళలతోనే సాధ్యం. సాహిత్యాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు శ్రీకళాపీఠం ఉద్భవించడం హర్షణీయమని పురావస్తుశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రజిత అన్నారు. బుధవారం కల్లూరు సుబ్బారావు పురావస్తుశాఖ ప్రాంగణంలో శ్రీకళాపీఠం సామాజిక, సాహిత్య, కళా సంస్థ ఆవిర్భావం దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. శ్రీకళాపీఠం అనంతలో మంచి కార్యక్రమాలను నిర్వహిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు గొల్ల ఉమాదేవి మాట్లాడుతూ.. ఉగాది పండుగ రోజున కవులు, కళాకారులను సత్కరించి వారి ప్రతిభకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం 12 మంది డైరెక్టర్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కంబదూరు షేక్ నబీరసూల్, నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య, ముడార్ సుధీర్, పండిట్ రియాజుద్దీన్, మారుతీశర్మ, శంకరరెడ్డి, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గంగాధర, కత్తివిజయ్‌కుమార్, లక్ష్మీశ్యాం, తోట బాలన్న పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణం పూర్తి చేయాలని వినతి

రాప్తాడు: భోగినేపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరారు. బుధవారం విజయవాడలో దేవదాయశాఖ మంత్రి ఆనం రాం నారాయణ రెడ్డిని ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయ నిర్మాణానికి గత ప్రభుత్వంలో రూ.1.60 కోట్లతో అంచనాలు వేయడం జరిగిందన్నారు. ఇందులో గ్రామ ప్రజలు 20 శాతం, ప్రభుత్వం సీజీఎఫ్ నిధులు 80 శాతం చెల్లించేలా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అయితే గ్రామ ప్రజలు రూ.20 లక్షలు ఇవ్వగా, సీజీఎఫ్ నుంచి రూ.50 లక్షలు మాత్రమే వచ్చిందన్నారు. మిగిలిన నిధులు ఇంకా రాలేదని తెలిపారు. ఆలయం పూర్తి అయ్యేలా చూడాలని ఎమ్మెల్యే పరిటాల సునీత మంత్రికి విజ్ఞప్తి చేశారు.

లాడ్జీల్లో పోలీసుల దాడులు



లాడ్జీలో తనిఖీ చేస్తున్న నాలుగో పట్టణ స్టేషన్ పోలీసులు

అనంతపురం: జిల్లాలోని లాడ్జీలు, దాబాలు, హోటళ్లలో బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. దాబాలు, హోటళ్లలో అక్రమంగా మద్యం వినియోగించకుండా.. అనుమానితులు లాడ్జిల్లో బస చేయకుండా తనిఖీలు చేపట్టారు. అక్రమ మద్యం నియంత్రణ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న దాబాలు, హోటళ్లల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి.

మహిళా సాధికారతతో దేశ పురోగతి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్‌టీయూ(ఏ) వీసీ సుదర్శన రావు

అనంతపురం: మహిళా సాధికారతతో దేశ పురోగతి సాధ్యమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు అన్నారు. బుధవారం జేఎన్‌టీయూ అనంతపురంలోని ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ.. మహిళలు క్రీడా, సైనిక రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి వారి హక్కులపై అవగాహన కల్పించడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత మాట్లాడుతూ.. నేటి భారతీయ మహిళలు విద్య, మీడియా, కళలు, సేవా విభాగాలు, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. స్త్రీ లేనిదే జననం, గమనం, సృష్టి లేదని తెలిపారు. స్త్రీ అంటే శక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చెన్నారెడ్డి, మహిళా సాధికారత డైరెక్టర్ ప్రొఫెసర్ వీబీ చిత్ర, కో-ఆర్డినేటర్ అజిత తదితరులు పాల్గొన్నారు.

దళారులపై కఠిన చర్యలు తీసుకోండి



డీఆర్ఓ మలోలకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: అరటి కొనుగోలు చేసే కంపెనీలతో కుమ్మక్కై పంట ధర తగ్గిస్తూ రైతులను దగా చేస్తున్న దళారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున, సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. అదే క్రమంలో అరటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ ఎ.మలోలను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 రోజుల క్రితం టన్ను అరటి ధర రూ.27 వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.14 వేలకు పడిపోయిందన్నారు. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని స్థితిలో రైతులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను రూ.27 వేలతో ప్రభుత్వమే అరటి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు వెంకటరాముడు యాదవ్, జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వీటీ రామాంజనేయులు, నాయకుడు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.